

# డాక్టర్ చెప్పిన కథలు
## - డా.శైలజ చందు



## 18వ కథ

మా గురువుగారు డా. కె. రవిబాబుగారు, గుంటూరులో ప్రముఖ సర్జన్. నాకు అన్ని విధాలా మార్గదర్శి. ఈ మధ్య కలిసినపుడు ఇంగ్లీషులో ఫస్సిఒన్ ఫొర్ వొర్క్ గురించి వివరించారు. పని పట్ల శ్రద్ధ, ఉత్సాహం ఎక్కువ మోతాదులో ఉంటే ఆ పని ఎంత బాగా చెయ్యవచ్చునో, ఆ గుణం కలిగిన వ్యక్తి ఎలా ఎదుగుతారో వివరించారు. ఆయన మాట్లాడిన ఆ మాట నుండి పుట్టిన కథ ఇది.

తను చేసే పనిలో ఆనందాన్ని వెతుక్కుని, పనికే అందం తెచ్చిన ఒక వ్యక్తి కథ.

"ఎవరా అబ్బాయి?"

"పెద్ద సార్ గారి కొడుకు."

"డాక్టరేనా?"

"అవును. ఈ మధ్యనే చదువైపోయి వచ్చాడు. చూపించుకుంటారా?"

"లేతగా ఉన్నాడుగా"

"పెద్ద కాలేజ్ నుండి చదువుకుని వచ్చాడు. పేరు రాయనా?" నర్స్ అడిగింది.

"అనుభవం ఉండొద్దూ. అయ్యగారెప్పుడొస్తారు"

"ఆపరేషన్ లో ఉన్నారు. టైం పడుతుంది. ఇంతలో చిన్న డాక్టర్ గారితో చూపించుకోండి"

"తొందర లేదులే . పెద్ద సారొచ్చాక రాయి పేరు""

బయట వెయిటింగ్ హాల్లో పేషంట్లు పెరుగుతున్నారు. తండ్రి రాబోయేలోగా వీళ్ళందరినీ చూసేద్దామనుకుని,

"ఒకరొకరిని పంపించు " అన్నాడు లోపలికొచ్చిన నర్స్ తో.

"పేపర్ వచ్చింది బాబూ. ఇదిగో!" అతని ఎదురుగా పేపర్ ఉంచింది.

"పేషంట్లను పంపు. చూస్తా"

ఆమె టేబుల్ మీద ఉన్న వస్తువులు సర్దుతూ ఆలస్యం చేస్తోంది.

"నీకే చెప్పేది. అందర్నీ రమ్మనూ." అంటూ కోటు అటూ ఇటూ సరి చేసుకున్నాడు.

'అందరూనా, ఒక్కరైనా కదిలేట్టు లేరు' అనుకుని

“పేపర్ చదువుకో బాబూ. నాన్నగారొస్తారుగా.”

తండ్రి రాగానే, అందరూ లోపలికొచ్చారు. చోటులేక మూల నిల్చోవాల్సి వచ్చింది. పెద్ద సార్ కు అసిస్టెంట్ లా ఒక వారం గడిచింది. తనంతట తాను ఒక్కరినైనా చూడలేకపోయాడు అనడం కన్నా, ఒక్కరు కూడా ఇతని దగ్గరకు రాలేదు.

ఆదివారం తండ్రి హాస్పిటల్ కు రాడని తెలుసు.

కానీ ఒకరో ఇద్దరో పేషంట్లు రాకపోరు. వాళ్ళనైనా చూడాలని, మెప్పించాలని అనుకున్నాడు ఉత్సాహంతో నిద్రపట్టలేదు.

ఆదివారం సూర్యుడితో పాటే నిద్రలేచి , రెడీ అయి హాస్పిటల్ కు వెళ్ళిపోయాడు.

స్టాఫెవరూ లేరు. ‘ఆదివారం అంటే కేలండర్ లో సెలవు కానీ, కేసులకు కాదు కదా’ అనుకుని లోపలికి వెళ్ళి కూర్చుని నవల చదువుకుంటూ పేషంట్ల కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. గంటా రెండు గంటలు గడిచాయి. పొద్దెక్కింది. ఎక్కడా అలికిడి లేదు.

బయటకు వచ్చి చూస్తే ఆయమ్మ కిటికీలు తుడుస్తోంది.

"బాబూ, ఏంటీ పెందలాడే వచ్చారూ?"

ఏం చెప్పాలో తెలియక "ఆ , రావద్దా మరీ " అన్నాడు.

“ఎవరికోసం చూస్తున్నారూ. ఆటకోసం ఫెండ్సులు వస్తారా?”

“కాదు. పేషంట్లెవరైనా వస్తారేమోననీ?”

“అవ్వ... పేషంట్లతో పేకాడతారా?"

"పేకాటేంటీ? "

"ఆదివారమొస్తే పేకాటో అని పోతాడు నా పెనిమిటి . ఇక ఆడికి మేమెవ్వరం కనపడం. "

" అయితే నేను చూడాలి మీ ఆయన్ని. పిలుచుకురా ఫో!”

"ఏం బాబూ, ఆడితో ఆడతారా పేక"

"ఎహె, పేకేంటే నీ తలకాయ, మీ ఆయనకు కళ్ళు కనపడంటున్నావుగా, వాణ్ణి తీసుకురా , పరీక్ష చేస్తా" "

"అయ్యో, ఆడి చూపు బాగానే ఉంది బాబూ, రాతే బాగోలా"

“అయితే నువ్వొచ్చి కూర్చో.”

“మీతో పేకాడానని తెలిస్తే , అయ్యగారు నన్ను పనిలోంచి తీసేస్తారు."

“ఈ పేక గోలేంటే, నీ మొగుడికన్నా నీకే ఉన్నట్టుంది ఆ పిచ్చి.”

“ఛీ ఊరుకోండి బాబూ, నాకు పిచ్చేంటీ. ప్రాణం పోయినా సరే పేక ముట్టుకుంటానా? ఎప్పుడన్నా జాతరనాడు కల్లుతాగుతా అంతే!”

“అరెరె , ఎంత పద్ధతి? ఎంత పద్ధతి?”

"మరేటనుకున్నారు, మా అయ్య అంత ఇదిగా పెంచాడు మమ్మల్ని.”

“సరే, మిగతా స్టాఫ్ ఏరీ, ఎవరూ రాలేదే?”

"ఆదివారం నాన్న గారు కేంప్ పెడతారు గా పల్లెలో . అందరూ పెందలాడే వెళ్ళిపోతారు."

"మరి నాకెందుకు చెప్పలేదు"

బయటికి నడిచాడు.

“ఏడికి బాబూ?”

“నేనూ వెళ్తా అక్కడికి.”

“అబ్బో పల్లె శానా దూరం. ఎళ్ళడమే కష్టం.”

“పాపం పల్లెకు మాత్రం ఇక్కడకు రావడం కష్టం కాదూ. నేనే వెళ్తా.”

అతను వెళ్ళే సరికి అక్కడంతా జాతరలా ఉంది. ఎక్కడ చూసినా జనాలు. ఉచితంగా చూస్తారు కాబట్టి, హాస్పిటల్ లో ఉన్న రద్దీ తో పోలిస్తే ఇంకా రెండింతలు ఉంది.

తండ్రికున్న పేరు, అక్కడున్న పేషంట్లనీ, కలిపి అతని చకచకా లెక్క కట్టింది మనసు.

తనెవరో తెలియడానికీ, స్వంతంగా ఎదగడానికి ఎన్నేళ్ళు పడుతుంది?

తండ్రి ఇవ్వనిదేమీ లేదు.

చదువు , తెలివి, బుద్ధి, ఎదగాలన్న కోరిక, అన్నీ ఇచ్చాడు

చల్లని నీడగా ఉన్నాడు.

విశ్రాంతిగా కూర్చుందామనుకునేవారికే నీడ సుఖాన్నిస్తుంది.

పరుగుతీసే మనసుకు విశ్రాంతిని మించిన శిక్ష ఉండదు.

వృక్షం నుండి పడిన విత్తనం దాని నీడన ఎదగలేదు.ఎదగాలంటే నీడని వదలి దూరంగా వెళ్ళాలి.

తన నిర్ణయం తండ్రికి చెప్పాడు.

"దూరంగా వెళ్ళాలనుకుంటావు. మంచిదే , ఒక్క విషయం చెప్తాను . అది ఎప్పటికీ గుర్తు పెట్టుకో." అని ఒక అయిదు నిముషాలు కొడుకుతో మాట్లాడారాయన.

ఆయన మాటల్లోని ఆశయం , స్ఫూర్తి వెలుగు చూపించింది. ఉత్సాహం నీడగా మారి అనుసరించింది.

"ఏంటి బాబూ, టిఫిన్ చెయ్యకుండా పోతున్నారే?"

"ఎనిమిదయ్యింది, నువ్వెప్పటికి చేస్తావో, నేనెప్పటికి పోవాలో, హాస్పిటల్ కి "

"ఎంతలో చేస్తాను. మీరింత ముందెళ్ళినా ఎవరూ రారు"

"ఏం, ఎందుకురారు"

" ఇంత పొద్దునే ఎవరూ నిద్ర లేవరు. మా వూళ్ళో కోడి కూడా మధ్యాహ్నమే లేస్తది."

అలానే వెళ్ళిపోతున్నాడు.

“నేను చెప్తే వినరుకదా.తవరిప్పుడు కోటేసుకుని కూర్చున్నారని, కోడి ముందే కూసుద్దా? దానలవాటు దానిదే.”

రెండో రోజు కూడా ఉదయమే లేచి వెళ్తుంటే,

“సారూ ! ఇప్పుడేపోయి ఏం చేస్తారు. ”

"నువ్వు నా పద్ధతి మార్చాలని చూడకు. టీ తీసుకురా "

టీ తాగి వెళ్తున్నాడు.

“ఎందుకు సార్ అంత హడావుడీ, అక్కడ ఎవరున్నారనీ? మీరు లేటుగా వెళ్తే మాత్రం ఎవరడుగుతారనీ?”

“కొంతమంది అంతేనే, వాళ్ళు టైము కెళ్ళిపోవాల్సిందే. ఎవరో అడుగుతారని కాదు.”

“ఏదీ , ఆ సూరీడు లాగానా? ఆయనా అంతే. ఒక్క అరగంట ఉండండి. గారెలేస్తాను.”

“సూర్యుడు నీ గారెలకోసం ఆగుతాడా, పిచ్చిదానిలా ఉన్నావే. నే పోతున్నా.”

“అయ్యగారూ, వద్దన్నా వెళ్తున్నారు. నే ముందే చెప్తున్నా. మా వూరి జనాల పద్ధతి మార్చుకోరు.”

“నన్ను వెళ్లనీయవే. కనీసం మీ ఊరి కోళ్ళకైనా పద్ధతి నేర్పనీ.”

రోజూ ఉదయమే లేచి, ముందే వెళ్ళి తన ఆఫీసు తలుపు తనే తీసుకుని కూర్చుని పుస్తకాలు చదువు వాడు.

శ్రమ పడేవారికి ప్రకృతి కూడా తోడవుతుంది. అతని పట్టుదలకు ఆ వూరి కోడి త్వరగానే కూసింది. పక్క ఊరి కోళ్ళు కూడా గొంతు కలిపాయి. .

మొదటి నెల అయే నాటికి అతని పద్ధతి ఊరందరికీ తెలిసింది.

చక్కటి పలకరింపు, ముఖం పై చెరగని చిరునవ్వు, వాళ్ళు చెప్పేది శ్రద్ధగా వినడం, వాళ్ళ బాధేమిటో వాళ్ళకర్థమయేట్టు విడమరచి చెప్పడం. సాధ్యమైనంత మంచి వైద్యం ఇచ్చేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించేవాడు.

ఇంతకన్నా పేషంట్లు ఆశించేదేముంటుంది.

పని చేసిన కొద్దీ ఉత్సాహం. ఆకలి, దాహం, నిద్ర, అంతా పనే అయింది. పనే ఊపిరైంది. కొన్ని నెలలలోనే , తీరికలేనంత ప్రాక్టీసొచ్చింది.

తమ స్పెషాలిటీలో కొత్త వైద్యాలు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏవి వచ్చాయో ఎప్పటికప్పుడు చూసుకుని, అవి ముందు తమ హాస్పిటల్ లోనే అందుబాటులో వచ్చేలా చేశాడు. వాటి ఉపయోగాలు ప్రజలకు తెలిసేలా చేసేవాడు. పరికరాలకు ప్రచారం అవసరమైంది కానీ, అతని క్రమశిక్షణకు, నిబద్ధతకు ప్రచారం లేకుండానే పేరొచ్చింది.

ఖాళీ లేనంతగా నిండిపోయేది వెయిటింగ్ హాల్. ఎంత పనిలో ఉన్నా, పేషంట్లు, వాళ్ల సౌకర్యాలు. ఎప్పుడూ అదే ధ్యాస. నిరంతరం మదిలో మధనం. మధనమెక్కడైనా అందించేది అమృతాన్నే. ఆ అమృతాన్ని పంచడానికి, ఆలోచనలని అమలు పరచడానికి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయని ఉత్సాహం.

మెట్లు ఎక్కాలనుకునే వారికే, శ్రమ గురించి భయం.

శిఖరాన్ని అందుకోవాలనుకునే వారికి కాదు.

" నిన్న సర్జరీ చేయించుకున్న పేషంట్లు మీతో మాట్లాడతారట సార్. "

" సరే. పంపించు"

"పెద్దయ్యగారు బాగా పరిచయమట."

ఇద్దరు పెద్దవాళ్లైన భార్యాభర్తలు వచ్చారు.

"మీ నాన్న గారు బాగా తెలుసు.”

తండ్రితో పరిచయాన్ని గుర్తు చేసుకున్నా డాయన.

" కంటి ఆపరేషన్ కోసం ఎక్కడికి వెళ్ళాలో అని చూస్తుంటే తెలిసిన వాళ్ళు నీ పేరే చెప్పారు. బయట నీకు చాలా మంచి పేరుంది తెలుసా?"

బదులుగా చిరునవ్వు నవ్వాడు.

" ఆపరేషన్ జరిగినట్లే లేదు. నాన్నగారిలానే చూసుకున్నావు." చేతులందుకుని చెప్పాడాయన.

"నాన్నగారితో పోలికా? భలే వాళ్ళే" నవ్వాడు.

“నాన్న కన్నా గొప్ప వాళ్ళని చూపిస్తే ఒప్పుకోవులే. నిజం చెప్పాలంటే అంతకన్నా బాగా చూసుకున్నావు. నేను మీ ఇద్దర్నీ చూశా కదా."

కాఫీ తెప్పించాడు. బయట పేషంట్లు , హడావుడీ గమనించి

“అసలు తీరిక లేదు నీకు , భోజనమైనా టైం కు చేస్తావా? ప్రతిరోజూ ఆలస్యం అవుతుందేమో కదా!” ఆవిడ అడిగింది.

“పర్లేదండీ.”

దేనికి పర్లేదో? భోజనానికో , ఆలస్యానికో ఆవిడకర్థం కాలేదు.

“నాన్నగారి దగ్గరకు ఈ మధ్య వెళ్ళొచ్చావా బాబూ?”

“లేదండి. ఫోన్ లో గొంతు విని కూడా చాలా రోజులైంది. ఒక రోజు ఖాళీ చేసుకుని వెళ్ళాలి.”

"నాన్న గారి గొంతు వినాలని ఉందా?"

"ఇప్పుడొద్దులెండి . నాన్నగారు పడుకునే టైం. ఫోన్ చేసి డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం లేదు"

"ఫోన్ లో కాదు. విను” అని మాట్లాడాడు. అచ్చు తండ్రి గొంతుతో మాట్లాడాడాయన .

“అరే, అచ్చు అలానే మాట్లాడుతున్నారు. ఎలా

తండ్రి గొంతుతో బాటు తన గొంతు కూడా పలికి చూపించడం తో

“మీరింత బాగా మిమిక్రీ చేస్తారని తెలియదే.” ఆశ్చర్య పడ్డాడు

అవీ ఇవీ మాట్లాడిన తర్వాత, బయట పేషంట్ల రద్దీ పెరుగుతోందని వెళ్తామని లేచారు. ఆయన వెళ్ళి కార్లో కూర్చున్నాడు. ఆవిడతో మాట్లాడుతూ వెంట వెళ్ళాడు.

“బాబూ, అంతా నాన్నగారికన్నా గొప్పగా చేస్తున్నావు. మరీ నాన్న గారు పేదవారికి ఉచితంగా చేసేవారు. అది కూడా చేస్తున్నావా?”

“కొంతకాలం ఆగి..”

మధ్యలోనే ఆపేసింది.

“ఎప్పుడో ఆగి చేద్దామనుకుంటే ఎప్పటికీ చెయ్యలేము. శ్వాస తీసుకోవడానికి తీరిక చూస్తామా చెప్పు. సహాయం కూడా అంతే"

షేక్ హాండ్ ఇచ్చి ఆయన కార్లో కూర్చున్నాడు.

ఆమె కూడా కార్లో ఆవిడ కూర్చుంది. గంధపు రంగు పట్టు చీర డోర్ లో పడకుండా జాగ్రత్తగా డోర్ వేశాడు.

“ఉంటానండీ.”

“నేను చెప్పింది మర్చిపోవుగా.” అతని చెంప తట్టింది.

"నేనొచ్చి ఆపరేషన్ చేయించుకుని వెళ్ళానని నాన్నగారితో చెప్పవోయ్." ఆయన ముందుకు వంగి చెప్పాడు.

"తప్పకుండా సార్ ." అన్నాడు కానీ,

ఈయనెవరో?

'పేరడిగితే బాగోదు కదా ! లోపలికి వెళ్ళాక ఫైల్ చూద్దాంలే' అనుకున్నాడు.

"నేనెవరని చెప్తావో . నా పేరు వేణు మాధవ్."

"వేణు మాధవ్." మర్చిపోకుండా ఉండడానికన్నట్టు పలికాడు.

"అవును. నేరెళ్ళ వేణు మాధవ్ అని చెప్పు."

రాత్రి తొమ్మిదవుతూ ఉంది.

శ్వాస లాగా సహాయం!

శ్వాసించే ప్రతివారూ, అవసరంలో ఉన్నవారికి సహాయపడాలి.

మధ్యాహ్నం ఆవిడ చెప్పిన మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తొస్తున్నాయి. వాటితో బాటే

తమ ఊరు విడిచి వస్తున్నపుడు తండ్రి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. మధ్యాహ్నం ఆవిడ వచ్చింది , తండ్రి మాటలు గుర్తు చెయ్యడానికే అనిపించింది.

తండ్రి చెప్పిన మాటలు , తను ఆయనకిచ్చిన మాట, అప్పటివరకూ ఎలా మర్చిపోయానా అని ఆశ్చర్యపడ్డాడు.

టీవీలో న్యూస్ వస్తూ ఉన్నాయి. విసుగ్గా ఉంది. ఏదో ఒకటి చెయ్యాలి అనుకుని, టీవీ కట్టేసి ఫోనందుకున్నాడు

“రంగారావ్, ఒక సారి అర్జంట్ గా రా.”

పావుగంటలో ఎదురుగా నిలబడ్డాడు.

“ఇక నుండీ , ప్రాక్టీసులో కొన్ని కేసులు ఫ్రీగా చేద్దామనుకుంటున్నాను.”

“కొన్ని కేసులంటే ఎన్ని సార్. వారానికొకటి చెయ్యండి.”

“వెరీ గుడ్ రంగారావ్. వారానికో ఊరు. ఎలా ఉంటుంది?”

“ఊరికి ఉచితంగానా?”

“అవును. మన జిల్లాలో కొన్ని ఊళ్ళు సెలెక్ట్ చెయ్యి. ఆ ఊళ్ళో ఇంటింటికీ తిరిగి కంటి చూపు లేని వాళ్ళెంత మంది ఉన్నారో సర్వే చేయించు. వాళ్ళని మనమే మన హాస్పిటల్ కు తీసుకువచ్చి ఆపరేషన్ చేయించి పంపేద్దాం. ఇంటి నుండి వచ్చి, మళ్ళీ వెళ్ళే వరకూ వాళ్ళు ఒక్క పైసా కూడా ఖర్చుపెట్ట కూడదు.”

చెప్పినంత సేపూ రంగారావు అసహనంగా కదులుతూనే ఉన్నాడు.

“దీనికా సార్ ఇంత అర్జంటుగా పిలిచిందీ. మీరు చెప్పేది సీరియస్సా?”

“రాత్రి పూట ఏం తోచట్లా. జోకులేద్దామంటే ఎవరూ దొరకలా. అందుకనీ నిన్ను పిలిచా.” చేతులు వెనక్కి పెట్టి వేళ్ళు విరుచుకుంటూ అన్నాడు.

“పర్లేదు సార్. నన్నేమైనా అనండి. నేనేం అనుకోను , మీకు బుర్రలో ఆలోచన రానే కూడదు. వచ్చిందంటే, నాకు భయమేస్తుంది. దీనంతటికీ ఎంత బడ్జెట్ అవుతుందో ఆలోచించారా? ఎంత చేసినా ఈ జనాలకు గుర్తుండదు కూడా.”

“జనాలకు గుర్తుండదా ! గుర్తుండకపోతే కష్టం ఆలోచిస్తున్నట్టు “ ఓ నిముషం ఆగి

“రంగారావ్, ఓ పని చేస్తా. ప్రతి ఊళ్ళో నీకో గుడి కట్టిస్తా. బడ్జెట్ లో బడ్జెట్.! శ్రీ శ్రీ శ్రీ రంగారావు స్వామి దేవస్థానం అని రాయిస్తా. వాళ్ళెట్లా మర్చిపోతారో నేనూ చూస్తా.”

"బడ్జెట్ సంగతి ఆలోచించరేంటి సార్ మీరు."

"బాధ్యతలు, బడ్జెట్లు నేను చూసుకుంటా గానీ, నువ్వో ముప్పై పల్లెటూళ్ళు సెలెక్ట్ చెయ్యి. వాటిని అడాప్ట్ చేసుకుందాం. మనం అడాప్ట్ చేసుకున్న ఊళ్ళలో ఎవరికీ బ్లైండ్ నెస్ ఉండకూడదు."

"సరే సార్. నాల్రోజుల్లో చూస్తాను."

"ఓరి నీ తొందర కూలా. ఓ నెలరోజులు తీసుకోవయ్యా." అంటూ తన ఐ మాక్ వైపు నడిచాడు.

"ఏంటి సార్, ఏం చేస్తున్నారు?" ఐ మాక్ ముందు కూర్చున్న యజమానితో అన్నాడు.

"నువ్వలా పక్కనే కూర్చుని కబుర్లు చెప్తుండు. కంప్యూటర్ గేంస్ ఆడుకుంటా."

"ఏంటో సార్ అంతా నీ అభిమానం." ముసి ముసిగా నవ్వుకుంటూ ఊళ్ళో సంగతులు చెప్తున్నాడు.

"ఏమైనా నీకు భలే టేలెంట్ ఇచ్చాడయ్యా దేవుడు. ఇంత కాలం నుండీ నాదగ్గర పనిచేస్తున్నావంటే దానివల్లే"

"ఏం టేలెంట్ సార్?"

" ఏ విషయాన్నైనా చక్కగా , త్వరగా అపార్థం చేసుకోగలవు. ఎవరిలోనూ చూడలేదు."

"పోండి సార్."

"నేనెక్కడికి పోతానుగానీ, పోయి పక్క రూం లో ప్రింటర్ దగ్గర పేపర్లు వచ్చుంటాయి. తీసుకురా!"

పేపర్లు తీసుకు వస్తూ వాటి వంక చూశాడు.

"కంప్యూటర్ ముందు ఆడుకుంటున్నారనుకున్నా. ఊళ్ళు సెలెక్ట్ చేసేశారుగా. కానీ ఇవి మరీ మారు మూల సార్ ఊళ్ళు సార్. ట్రాన్స్ పోర్ట్ కూడా ఉండదు."

"ఎప్పుడూ ఇక్కడిక్కడేనా. కారు వెళ్ళని ఊరు చూసొద్దాం రంగారావు. నాకూ కాలు సాగినట్టుంటుంది. నీకూ పొట్ట కరుగుతుంది.

"పొట్టెక్కడ సార్. నేనీ మధ్య డైటింగ్ కూడా చేస్తుంటే"

"ఏం డైటింగో, ఇందాక నువ్వొస్తుంటే , ఏంటా రంగారావు డ్రమ్ములో నిలబడి నడుస్తున్నాడూ అనుకున్నా."

"ఏంటి సార్ మీరు మరీనూ, ఏ ఊళ్ళైతే మనకెందుకు? హాయిగా పావుగంటలో వెళ్ళొచ్చే ఊళ్ళు సెలెక్ట్ చెయ్యండి."

"అంత దూరం కూడా ఎందుకులే! పక్కింటి వాళ్ళని పిల్చుకురా. వాళ్ళకు రిప్రజెంటేటివ్స్ ఇచ్చిన శాంపుల్స్ ఇచ్చి, ఇద్దరం ఫోటోలు తీయించుకుని పేపర్లో వేసుకుందాం. ఏమంటావు."

"ఏంటి సార్ అంత కోపం."

"సర్లే, రేప్పొద్దున్న స్టాఫ్ అంతా ఏడింటికే నా ఆఫీసులో కనపడాలి."

"ఎందుకు సార్."

"ఎందుకో ఇప్పుడే చెప్పాలా? పొద్దున్న వరకూ ఆగలేవా. ఇక పో, నాకు నిద్రొస్తుంది."

"మొత్తం ముప్పై ఊళ్ళు సెలెక్ట్ చేశాను. పది పది ఊళ్ళ చొప్పున మూడు గ్రూపులు చేద్దాం. ప్రతి ఊళ్ళో, మన మనిషి వెళ్ళి చూపు సరిగా లేని పేషంట్లను గుర్తించి వాళ్ళ లిస్ట్ ఒకటి తయారు చెయ్యండి. వాళ్ళకు ఆపరేషన్లు మన హాస్పిటల్ లోనే చేద్దాం. వాళ్ళ ఊరి నుండి మన హాస్పిటల్ కు వచ్చి, మళ్ళీ వాళ్ళు ఆరోగ్యంగా వెళ్ళేవరకూ మనదే బాధ్యత! ఇక ఆ ఊరిలో పేషంట్ల లిస్ట్ రాయడానికి ఎవరికైనా ఉద్యోగం ఇద్దాం. ఆడవాళ్ళైతే బెటర్."

" మనకు బాగా తెలిసిన లేడీస్ ఉన్నారు సార్, వాళ్ళను పంపిద్దాం." రంగా రావు ముందుకొచ్చాడు.

"నీకు లేడీస్ తెలుసా ? ఊరుకో రంగారావ్. ఏమ్మాటలు? అదేం వద్దు. ఆ ఊళ్ళోనే , కొద్దిగా చదువుకున్న అమ్మాయికెవరికైనా ఆ ఉద్యోగం ఇవ్వండి."

ప్రతి శని ఆదివారాలు ఎంచుకున్న పల్లెటూళ్ళ నుండి వచ్చే పేషంట్లకు ఆపరేషన్ చెయ్యడమే సరిపోయేది.

ఎంత లేదన్నా, బడ్జెట్ ఎక్కువవుతోందని , సంపాదనలో ఎక్కువశాతం అటే పోతోందనీ తెలుస్తోంది.

ఎక్కుపెట్టిన బాణానికి లక్ష్యాన్ని చేరడమే తప్ప, వేగం పైన లక్ష్యముండదు.

ఉదయం సర్జరీలు అయ్యాక బ్రేక్ ఫాస్ట్ కోసం కూర్చోబోతుండగా వచ్చాడు రంగారావు.

"సార్, ఒక పని చేద్దాం సార్!"

"చెప్పు." అన్నాడు డైనింగ్ టేబుల్ వైపు నడుస్తూ .

"మనం వెళ్ళి, ఆ ఊళ్ళలో ఒక మీటింగ్ పెట్టి ఆపరేషన్లు చేయించుకునే వాళ్ళందర్నీ పిలిపిద్దాం సార్. అసలు మనమేం చేస్తున్నామో , ఎంత చేస్తున్నామో, మనకు ఎంత ఖర్చవుతుందో వాళ్ళకు తెలియాలిగా సార్"

"నిజమే కదా. తెలియాలి. వాళ్లకు ఖర్చు తెలియాలి" అంటూ ఆలోచనలో పడ్డాడు. హఠాత్తుగా

"అరె అరె ఎంత పొరపాటైంది రంగారావ్. మొన్న మా క్లాస్ మేట్ ఒకామె భోజనానికొచ్చిందోయ్. బాగా మర్యాద చేసి పంపాను కానీ , కేజీ బియ్యం ఎంత రేటో ఆవిడతో చెప్పడమే మర్చిపోయా. ఛా, నేను, నా మతిమరుపూ.."

"సార్, ఏంటి సార్. ఎప్పుడు చూసినా నన్ను ఆట పట్టిస్తుంటారు. మనమేం చేస్తున్నామో వాళ్ళకు తెలియాలి కదా "

"మనమేం చెయ్యాలో మనకు తెలిస్తే చాలు."

"ఇంత ఖర్చు పెట్టి చేస్తున్నారు, కనీసం మీరెవరో ఏమిటో వాళ్ళకు తెలియొద్దా?"

"నిజమే రంగారావ్. తెలియాలి. సరే రా..బ్రేక్ ఫాస్ట్ చేద్దువుగాని ."

"ఇప్పుడే హోటల్ లో పూరీ తిని వచ్చా సార్."

"ఇంతకూ వాడెట్లా ఉన్నాడు. బాగున్నాడా? "

"ఎవరు సార్?"

"పూరీ చేసిన వాడు. వాణ్ణి చూడకుండా తినేసి వచ్చావా? ఏంటి రంగా రావు . ఇట్లా తయారయ్యావు. పూరీ ఎవరు చేశారో నీకు తెలియొద్దా ?"

"సార్ , ఏంటి సార్ ఎగతాళి."

"ఆపరేషన్ చేసేది కళ్ళు కనపడాలనా, మనం కనపడాలనా?"

"ఏంటో సార్, నా బుర్రకసలు మీరు అంతుపట్టరు."

"ఎన్నాళ్ళబట్టీ ఇట్లా అనిపిస్తుందీ నీకు?"

"ఏంటి సార్ ?"

"లేనిది ఉన్నట్టు అనిపించడం! బుర్ర లాంటిదేదో ఉందని ఫీలవుతున్నావుగా. అలా అనిపించడం చాలా డేంజర్ రంగారావ్. మా క్లాసులో మంచి స్పెషలిస్ట్ ఉన్నాడు, సంజయ్ అనీ. నాకు బాగా ఫ్రెండే. ఒక సారి చూపెట్టుకుందువులే "

ముందు అయిదు వూళ్ళలో అంధత్వాన్ని నిర్మూలించాడు. ఆ అనుభవంతో వెంటనే మరో అయిదు ఊళ్ళు. ఆ తర్వాత, దాదాపు ఇరవై గ్రామాలలో తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతను చేస్తున్న వంటరి యజ్ఞానికి ప్రభుత్వం స్పందించింది. ఒక్కొక్క గ్రామాన్నీ లక్ష్యంగా చేసుకుని అతడెలా పనిచేస్తున్నాడో వివరాలు కనుక్కున్నారు ప్రభుత్వాధికారులు. ప్రభుత్వం తరపున కూడా గ్రామాల్లో అంధత్వాన్ని నివారించడానికి అతని సలహాలు తీసుకున్నారు.

"సార్, కలెక్టర్ గారు మనం పనిచేసిన ఊళ్ళలో అంధత్వం నిర్మూలించినట్లు సర్టిఫై చెయ్యడానికొస్తున్నారు. ఇక మీరు తప్పించుకోవడానికి లేదు. మీటింగ్ కు రావల్సిందే."

తప్పని సరై వీలు చేసుకుని మీటింగ్ కు వెళ్ళాడు. ఊరి జనమంతా అతన్ని చూసేందుకు వచ్చారు.

అందరూ వచ్చి నమస్కారాలు చేస్తున్నారు. ఒక పెద్దాయన వచ్చి శాలువా కప్పాడు.

"అరె, ఇవేంటి, ఇవన్నీ ఏం వద్దు" అతను వారించాడు.

"వద్దనకండి బాబూ, చూపొచ్చాక నువ్వెట్టుంటావో చూద్దామని నీ ఆస్పత్రికొచ్చా. నాలుగురోజులైనా అగపడకపోతివి. ఆస్పత్రిలో ఒకటే జనాలు, తొక్కిసలాట. వెంకన్న దర్శనమే తొందరగా అవుద్ది."

"అరెరె, నాకు తెలియదే"

"ఎట్టాగైనా నువ్వు అగపడతావన్న నమ్మకంతోనే వెనక్కొచ్చా. అనుకున్నట్టే మా ఊరికొచ్చావు."

"నేను మామూలు మనిషినే. మరీ గొప్పోణ్ణి చెయ్యొద్దు "

ఏవేవో మర్యాదలు చెయ్యడానికి పూనుకుంటుంటే వద్దన్నాడు.

"లోకానికి వెలుగిచ్చే సూరీడు పూజనాశించడు కదా అయ్యా . దూరం నుండే దణ్ణవెడతాము. మాకు పైసా ఖర్చు లేకుండా మా కళ్ళకు చూపునిచ్చావు. మా ఊరికి వెలుగయ్యావు. మా ఊరికొచ్చిన సూరీడుకి ఏ మర్యాదా చెయ్యకుండా పంపితే మాకేవన్నా సుకంగా ఉంటదా.?" పూలదండ వేశాడు.

"ఎందుకింత ఖర్చు మీకు , ఇవన్నీ అవసరం లేదు. నిజంగా అక్కర్లేదు" నిజాయితీగా అన్నాడు. వాళ్ళంతా అతన్ని పూలదండల్లోనూ, అభిమానంతోనూ ముంచెత్తుతున్నారు.

అందరూ వచ్చి శాలువాలు కప్పుతుంటే ,ఇదెక్కడి గొడవన్నట్టు , రంగారావు వంక నిస్సహాయంగా చూశాడు.

"సార్, కాసేపూరుకోండి మీరు. వాళ్ళ సంతోషానికి అడ్డు చెప్పకండి" అతని ముఖంలో ఆనందానికి అంతులేదు.

తర్వాత ప్రెస్ మీట్ లో కూర్చున్నాడు.

"బ్లైండ్ నెస్ ఫ్రీ విలేజెస్ కోసం ఎంతో ఖర్చు పెడుతున్నారు కదా. మీది ఈ ఊరుకాదు. ఎక్కడినుండో వచ్చారు. ఇక్కడ మారు మూల గ్రామాల్లో ప్రజలకు స్వంత ఖర్చుతో కంటి చూపు తెప్పిస్తున్నారు. ఏ ఉద్దేశం తో చేస్తున్నారు. ఏదో కారణం ఉండి ఉంటుంది.

ఒక క్షణం మౌనంగా ఉన్నాడు. తండ్రి మాటలు గుర్తు చేసుకున్నాడు.

"ఇక్కడికి రాబోయే ముందు మా నాన్నగారు ఒక మాట చెప్పారు. ప్రతి మనిషికీ ఒక ప్రజ్ఞ ఉంటుంది. మనం బ్రతికున్నంత వరకే ఆ ప్రజ్ఞకు ఉపయోగించగలం. మనకు తెలిసిన విద్యను సంపాదనకోసమే కాకుండా సాధ్యమైనంత ఎక్కువ మందికి ఉపయోగపడేలా చూడమన్నారు. ఆయన చెప్పిన మాటలే ఈ పనికి స్ఫూర్తి."

"ఇంత పని చేస్తుంటారు. మీకు అలసట రాదా. మీరెప్పుడూ చాలా ఉత్సాహంతో పొంగిపోతున్నట్టుంటారు. ఎలా సాధ్యం?"

"ఇష్టమైన పని చేస్తుంటే ఉత్సాహం సముద్రం అంత అవుతుంది. సముద్రం గ్లాస్ లో పట్టదు కదా. అందుకని పొంగిపొర్లుతుంటుంది."

"మీరు అలిసిపోయేదెపుడు?"

"పని లేనపుడు."

"జీవితమంటే పనేనా? మీకు వేరే వ్యాపకాలుంటాయా?"

"భలేవాళ్ళే, ఎందుకుండవు? కాన్ఫరెన్సులు, ట్రావెలింగ్, స్నేహితులు! స్నేహితులు లేకుండా, వాళ్ళను కలవకుండా ఉండలేను."

"సోషల్ సర్వీస్, హాస్పిటల్ పని, స్నేహితులు వీటన్నిటికీ మీకు టైమెలా దొరుకుతుంది?"

"బిజీగా ఉన్నానని చెప్పే వాడికి టైముండదు, కానీ బిజీగా ఉండేవాడికి ప్రతిదానికీ టైం దొరుకుతుంది."

"మీరు సాధించిన విజయాల గురించి మీరేం అనుకుంటుంటారు?"

"నేనేదో విజయాలు సాధించానని అనుకోవడం లేదు. నాకిష్టమైన పనిచేస్తున్నాను. సంతోషంగా ఉంది. అంతే."

"మీ కెరీర్ లో మీరు గర్వ పడిన క్షణం ఏమిటి?"

" నా వృత్తి , నా జీవితం బాగుంది. నాకిష్టమైన మార్గం లో, నాకు నచ్చినట్లు నడుస్తున్నాను. అందులో గర్వపడేదేముంటుంది."

ప్రెస్ వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

"సార్, పెద్దయ్యగారు ఫోన్ చేశారు. సర్జరీ చేయించుకోవాలట."

"నాన్నగారు ఎక్కడ కావాలంటే అక్కడ అరేంజ్ చేద్దాం. కనుక్కో"

"నన్ను ఆ డాక్టర్ గారితో మాట్లాడి అప్పాయింట్ మెంట్ తీసుకోమన్నారు."

"డాక్టర్ ఎవరో చెప్పు . నేను మాట్లాడతాను."

" కష్టం సార్."

"నేనే ఫోన్ చేసి కనుక్కుంటా. నేనడిగితే కాదనరు."

"మీరు ఆయనతో మాట్లాడడమా. కుదిరే పనే కాదు."

"ఇంతకూ ఎవరో పేరు చెప్పు. నీకెందుకు నేను అప్పాయింట్ మెంట్ సాధిస్తాగా!"

"నాన్నగారు చెప్పిన డాక్టర్ పేరు. డా. చిలుకూరి శరత్ బాబు, మీ పేరే "

"రంగారావ్. వెళ్తున్నారే , ఆ ప్రెస్ వాళ్ళని పిలువు. వాళ్ళడిగిన చివరి ప్రశ్నకు జవాబు దొరికింది. రమ్మను."

Post your comments







డా. చిలుకూరి శరత్ బాబు.
వరంగల్ లో ప్రముఖ నేత్ర వైద్యుడు.
జీవన సహచరి డా. అనూ తో కలిసి ప్రాక్టీస్ చేస్తుంటాడు.

సుయోధనుడికి స్నేహగుణంతో పాటు
మంచితనం కూడా కలిస్తే ,
సహాయం చేసే మనసుంటే ,
సరదాగా మాట్లాడగలిగిన నేర్పుంటే,
శ్రీకృష్ణుడి అల్లరి తోడైతే,

అదే మా క్లాస్ మేట్ శరత్ బాబు.
విజయగర్వాన్ని మొహమాటం లేకుండా పక్కన పెట్టేయగలడు.
తనకున్న మంచి గుణాలన్నింటినీ నేర్పుగా కప్పి పెట్టేసి మమ్మల్ని అప్పుడప్పుడు విసిగిస్తుంటాడు. పోట్లాడతాం కానీ, అభిమానించకుండా ఉండలేము. ఎంత బిజీగా ఉన్నా సరే, స్నేహానికి విలువిచ్చే శరత్ లేని 1982 బాచ్ ని మేమెవరం ఊహించలేము.
అతని కథ వ్రాయడానికి అవసరమైన వివరాలను అందించిన డా. అనూకు ప్రత్యేక కృతజ్ఞతలు
అలుపెరగని ఈ శిఖరం
మరిన్ని విజయాలను అందుకోవాలని, ముచ్చటైన జంట అనూ, శరత్ లు కలకాలం సంతోషంగా ఉండాలని , కోరుకుంటూ

చందు శైలజ

(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)

COMMENTS